క్లుప్తంగా

శేషారెడ్డి స్టేడియంలో మౌలిక వసతులు కల్పిస్తాం



స్టేడియంను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్: స్థానిక బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో ఆటగాళ్లకు కనీస సౌకర్యాలు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హామీ ఇచ్చారు. ఆదివారం స్టేడియంను సందర్శించారు. క్రీడాకారులకు స్టేడియంలో ఉన్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, ప్రేక్షకుల గ్యాలరీ సౌకర్యంతో పాటు స్టేడియం పైభాగంలో స్వల్ప మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు. చైర్మన్ వెంట ఏఈ సురేష్, కౌన్సిలర్ నాగేంద్ర, స్టేడియం కమిటీ సభ్యుడు వెంకట్రావ్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి గుడి పూజారి మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

డోన్ టౌన్: పట్టణంలోని ఇందిరానగర్ ఆంజనేయస్వామి ఆలయ పూజారి లక్ష్మీ నారాయణ శర్మ (59) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. శనివారం రాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మాజీ మంత్రి బుగ్గన సంతాపం

డోన్: లక్ష్మీనారాయణ శర్మ మృతిపై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు విరాళం



విద్యార్థులకు ప్లేట్స్ అందజేస్తున్న దాత

సంజామల: స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహం విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, దాత చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యతో పేదరికాన్ని నిర్మూలించవచ్చని తెలిపారు. పేదరికంలో చదువుకుని దేశానికి సేవ చేసిన మహానుభావులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. క్లబ్ కార్యదర్శి వెంకటరాముడు, వసతి గృహం సంక్షేమ అధికారి మునిరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



శిబిరానికి తరలివచ్చిన జనం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 1200 మందికి గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, కంటి, చర్మం, కిడ్నీ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులను ట్రస్ట్ డైరెక్టర్స్ సన్మానించారు. పెద్దిరెడ్డి షేక్షావల్ రెడ్డి, మౌలాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఆరు బైక్‌లు సీజ్



బైక్‌లను సీజ్ చేస్తున్న పోలీసులు

అవుకు: మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామంలో ఎస్ఐ రాజారెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని అనుమానిత ఇళ్లలో సోదాలు చేశారు. 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సరైన పత్రాలు లేని ఆరు బైక్‌లను సీజ్ చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలికి, సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: మండలంలో అర్హులైన వారు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు ఇంటి స్థలం, పక్కాగృహం లేని కుటుంబాలు ఆయా గ్రామ సచివాలయాలకు వెళ్లి హౌసింగ్ ఫర్ ఆల్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని తెలిపారు.

రోడ్డు విస్తరణ జరిగేనా..?

- కొలిమిగుండ్ల- జమ్మలమడుగు రోడ్డు నిర్మాణంలో జాప్యం
- ఏటా పెరుగుతున్న వాహనాల సంఖ్య
- ప్రమాదకరంగా కల్వర్టులు
- దృష్టిసారించని ప్రభుత్వం



కొలిమిగుండ్ల-జమ్మలమడుగు మార్గంలోని కల్వటాల వద్ద ప్రమాదకరంగా కల్వర్టు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని నెల్లూరు–ముంబై ప్రధాన రహదారి రెండు లైన్‌ల రోడ్డుగా ఎప్పుడు విస్తరణ జరుగుతుందా అని వాహనదారులు ఎదురుచూస్తున్నారు. కొలిమిగుండ్ల క్రాస్ రోడ్డు నుంచి జమ్మలమడుగు వరకు 43 కి.మీ దూరం ఉంది. ఈ దూరం మాత్రమే రోడ్డు విస్తరణ జరగకపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు మీదుగా కడప, తిరుపతి తదితర పట్టణాలకు జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. కొలిమిగుండ్ల నుంచి జమ్మలమడుగు వరకు రోడ్డు సరిగా లేదు. ఈ మార్గంలో రోజు రోజుకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలిమిగుండ్ల నుంచి జమ్మలమడుగు డబుల్ లైన్ రోడ్డు నిర్మించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపడంతో అప్పట్లోనే జాతీయ హోదాకు అమోదముద్ర వేసింది. తర్వాత సాధారణ ఎన్నికలు జరగడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ రోడ్డును కూటమి ప్రభుత్వం ప్రభుత్వ, ప్రవేట్ భాగస్వామ్య(పీపీపీ) విధానంలో నిర్మించాలని భావించింది. దీనికి సంబంధించి డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు రోడ్డు విస్తరణకు సంబంధించి ముందడగు పడలేదు. 43 కి.మీ దూరం ప్రయాణించాలంటే వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. చాలా చోట్ల రోడ్డు దెబ్బతింది.

భయపెడుతున్న కల్వర్టులు

నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో కల్వర్టులు ప్రమాదకరంగా మారి వాహనదారులను భయపెడుతున్నాయి. కనీసం కల్వర్టుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఎలాంటి రక్షణ చర్యలు చేయకుండా వదిలేశారన్న విమర్శలున్నాయి. కల్వటాల వద్ద రెండు చోట్ల కల్వర్టులు లోలెవల్‌లో ప్రమాద తీవ్రతను పెంచేలా ఉన్నాయి. సైడ్ వాల్‌లు లేకుండా ప్రమాదకరంగా మారాయి. ఈరెండు ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో వరద నీరు పైన ప్రవహిస్తుండడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడుతోంది. పలు చోట్ల రోడ్డు పక్కన రెండు అడుగుల దూరంలోనే గుంతలు ఉన్న కారణంగా యాక్సిడెంట్‌లు జరుగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం కల్వటాల వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడడంతో 16 మంది గాయపడ్డారు. ఇలా చాలా చోట్ల ప్రమాదకర ప్రాంతాలు ఉన్నాయి. వాహనాల రద్దీగా అనుగుణంగా రోడ్డును విస్తరింపజేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు రైతుల ధర్నా

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు సంఘం నాయకులు సోమవారం ధర్నాకు పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వల్ల ఐదేళ్ల నుంచి పంటలు నష్టపోతున్నా పట్టికోలేదని రైతు సంఘం నాయకులు ఆరోపించారు. రైతు సంఘం నాయకులతో కంపెనీ ప్రతినిధులు చర్చలు జరిపినా ఎలాంటి హామీలు ఇవ్వలేదన్నారు. సిమెంట్ కంపెనీ తీరుకు వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

స్కూటరిస్టుకు గాయాలు

డోన్ టౌన్: చిన్నమల్కాపురం రోడ్డులోని నగరవనం సమీపంలో ఆదివారం బైక్ అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తి గాయపడ్డాడు. బనగానపల్లె మండలం పసుపల గ్రామానికి చెందిన బాలు డోన్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సమీప బంధువును పరామర్శించడానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బైక్ అదపు తప్పి ప్రమదానికి గురయ్యాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విధి నిర్వహణలో సేవలే చిరస్మరణీయం



ప్రకాష్‌రెడ్డిని సత్కరిస్తున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని.. విధి నిర్వహణ కాలంలో నిబద్ధతతో చేసిన సేవలే వారికి గుర్తింపు తీసుకొస్తుందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంఈఓ రామనర్సయ్య అన్నారు. పాతపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లె ప్రకాష్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆదివారం డోన్ షాదిఖాన ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయులు, ప్రముఖులు ప్రకాష్‌రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. అనేక విద్యా సంస్థలు నెలకొల్పి పేదలకు ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించిన ఘనత కూడా ఆయనకు దక్కుతుందన్నారు. ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో సిద్ధార్థ, వైష్ణవి కళాశాలల కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, కోడుమూరు, ప్యాపిలి కళాశాలల ప్రిన్సిపాల్స్ సుబ్రమణ్యం, షేక్షావలి, వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, జగదుర్తి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెలకే హెచ్‌ఎం పోస్టు ఖాళీ



కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల

కొలిమిగుండ్ల: స్థానిక ఉన్నత పాఠశాలలో ఏడాది తర్వాత హెచ్‌ఎం పోస్టు భర్తీ అయింది. ఇందులో ట్విస్ట్ ఏంటంటే పదోన్నతిపై వచ్చిన ఆ హెచ్‌ఎం సోమవారం పదవీ విరమణ చేయనున్నారు. దీంతో యథావిధిగా పాఠశాలలో రెగ్యులర్ హెచ్‌ఎం పోస్టు ఖాళీ ఏర్పడనుంది. ఇటీవల విద్యాశాఖ నిర్వహించిన పదోన్నతుల్లో భాగంగా అంకిరెడ్డిపల్లె మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన జయరామిరెడ్డికి పదోన్నతి కల్పించడంతో కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా జూన్ 1వ తేదీ బాధ్యతలు స్వీకరించారు. నెల రోజుల్లోనే ఆయన పదవీ విరమణ పొందుతున్నారు. పాఠశాలలో 500 మందికి పైగానే విద్యార్థులున్నారు. హెచ్‌ఎంగా జయరామిరెడ్డి రిటైర్ అయ్యాక ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంను పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడికి నియమించాల్సి ఉంది. సీనియర్ ఉపాధ్యాయుడు ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు ఆసక్తి కనబర్చడం లేదని తెలుస్తోంది. గతంలో రెగ్యులర్ హెచ్‌ఎంగా ఉన్న బాలసుబ్బారెడ్డి ఏడాదిన్నర క్రితం రిటైర్ అయ్యాక ఆయన స్థానంలో హుశేనయ్యకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

నిర్మాణాలను కూల్చివేసే ప్రయత్నం సరికాదు



కూల్చి వేసిన నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు, కార్పెంటర్లు

బనగానపల్లె రూరల్: పట్టణంలో కార్పెంటర్ల అసోసియేషన్ సభ్యుల షెడ్ల కూల్చివేత ప్రయత్నం ఉపసంహరించుకోవాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాజ్ హుస్సేన్ అన్నారు. పట్టణంలో కూల్చివేసిన బేస్‌మెంట్‌లను ఆయన పరిశీలించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బనగానపల్లెలోని పేద కార్పెంటర్లకు 1.30 ఎకరాల ప్రభుత్వ భూమిని డీపట్టాగా మంజూరు చేసి రిజిస్టర్ చేశారని తెలిపారు. ఈ స్థలంలో సుమారు 120 మంది కార్పెంటర్ల కుటుంబాలు షాపులు వేసుకుని జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. ఇదే స్థలంలో మసీదు కూడా నిర్మించినట్లు చెప్పారు. అయితే మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కాలువ వెడల్పు కోసమంటూ ఈ స్థలాలను జేసీబీతో తొలగించాలనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

గురుశిష్యుల బంధం గొప్పది



మాట్లాడుతున్న వక్త నారాయణరెడ్డి

కొలిమిగుండ్ల: గురుశిష్యుల పరంపర అనాదిగా వస్తున్న సంప్రదాయమని ఆధ్యాత్మికవేత్త వైవీఎస్ నారాయణరెడ్డి, వేణుగోపాల్ అన్నారు. ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ జీవనానికి, హిందూ సంస్కృతికి ప్రతీకగా భగవాధ్వజాన్ని స్వయం సేవక్ సంఘ్ శ్రేష్ఠ గురువుగా స్వీకరించిందన్నారు. అందుకే దేశవ్యాప్తంగా ఘనంగా గురుపూజోత్సవాన్ని నిర్వహించారని చెప్పారు. దేశమంతా కీర్తి ప్రతిష్ఠలు తెచ్చుకున్న ఛత్రపతి శివాజీ తన గురువైన సమస్త రామదాసు ఆజ్ఞ లేనిదే ఏ కార్యం తలపెట్టేవాడు కాదన్నారు. గురువు అడుగు జాడల్లో నడుచుకున్నందుకే పేరు ప్రతిష్ఠలు వచ్చాయన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుంది



హెచ్‌ఎంను సత్కరిస్తున్న సమితి సభ్యులు

డోన్ టౌన్: ఉద్యోగంలో పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుందని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్‌మోహన్, అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు అన్నారు. వివేకానంద సేవా సమితి కార్యవర్గ సభ్యుడైన టీచర్ చిన్నపరెడ్డి హెచ్‌ఎంగా పదోన్నతి పొంది హోళగుందకు బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. సమితి సభ్యులు తొగట సురేష్‌బాబు, శ్రీనివాసులు, గంగిశెట్టి, రమణయ్య, సాయినాథ్, ఏవీ రావు పాల్గొన్నారు.

పథకాల అమల్లో జాప్యం తగదు



దొరపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని దొరపల్లె గ్రామంలో ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా జాప్యం చేయడం సరికాదన్నారు. మరోసారి మోసం చేయాలని చూస్తే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. త్వరలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు.

- అమడాల, గుంజలపాడు, జోళదరాశి ఫీడర్ల పరిధిలోని కోవెలకుంట్ల, భీమునిపాడు, బిజనవేముల, సౌదరదిన్నె, కంపమల్ల గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుంది.
- రేవనూరు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు..
- కలుగొట్ల, కొప్పెర్ల, అల్లూరు, కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 7.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉంటుంది.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయానికి సోమవారం నుంచి ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

డోన్: అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డోన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ద్రోణాచలం సేవా సమితి ప్రాణదాత సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ వైద్యులతో పాటు ద్రోణాచలం సేవాసమితి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు స్థానిక షాదిఖానలో శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు షాదిఖాన రాజు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవు రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉచిత, శీఘ్రదర్శనం, అభిషేకం, క్షీరాభిషేకం, మహదాశీర్వచనం ఆర్జిత సేవాటికెట్లతో భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉదయం స్థానిక అలంకార మండపంలో శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



సంజామలలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

సంజామల: గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమణయ్య హెచ్చరించారు. ఆదివారం సంజామల పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. అల్లర్ల జోలికి వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవితం గడపాలని సూచించారు. మంచి ప్రవర్తనతో మెలిగితే రౌడీషీటర్ ఎత్తివేసే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం



నూతన కమిటీతో ఎమ్మార్పీఎస్ నాయకులు

కోవెలకుంట్ల: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ సమితి జిల్లా అధికార ప్రతినిధి బోడెమ్మనూరు రాజు సూచించారు. ఆదివారం మండలంలోని పొట్టిపాడు గ్రామంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూలై 7వ తేదీ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో మాదిగల ఆత్మగౌరవ జెండాలను ఆవిష్కరించాలని సూచించారు. సమితి నాయకులు నాగేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సంజామలలో పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు



ఆకుమల్ల మెయిన్ బజారులో..

పట్టపగలే విద్యుత్ వెలుగులు

మండల కేంద్రం సంజామల సహా పలు గ్రామాల్లో వీధిలైట్లు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. లైట్లు కూడా త్వరగా దెబ్బతింటున్నాయి. తహసీల్దార్ కార్యాలయం దగ్గర ప్రధాన రహదారిపై రెండు విద్యుత్ స్తంభాలపై ఉన్న లైట్లు రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయి. అదే విధంగా ఆకుమల్ల గ్రామంలోని మెయిన్ బజార్ ప్రాంతంలోనూ వీధి లైట్లు నిరంతరం వెలుగుతుండడం గమనార్హం. సాధారణంగా వీధి లైట్లు ఉదయం 6 గంటల వరకు, సాయంత్రం 6 తర్వాత మాత్రమే వెలిగించాలి. కానీ కొన్ని ప్రదేశాల్లో ఇవి 24 గంటలు వెలుగుతుంటే, మరికొన్ని గ్రామాల్లో వీధిలైట్లు నెలలుగా పనిచేయక పోయినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు గ్రామ స్థాయిలో పర్యటించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–సంజామల

గొడవలకు వెళ్లి ఇబ్బందులు తెచ్చుకోవద్దు



పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: అనవసర విషయాలు, గొడవల జోలికి వెళ్లి ఇబ్బందులను కొనితెచ్చుకోవద్దని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఎస్ఐ రమేష్ బాబుతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని క్షణికావేశంలో చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సొంత నిర్ణయాలు తీసుకోవద్దని, ఎవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు రావాలని పేర్కొన్నారు.

ఉత్తమ పనితీరుతోనే గుర్తింపు



ఎస్ఐ వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

బనగానపల్లె: ఉద్యోగులకు ఉత్తమ పనితీరుతోనే మంచి గుర్తింపు లభిస్తుందని బనగానపల్లె సీఐలు ప్రవీణ్‌కుమార్, మంజునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో బనగానపల్లె ఎస్ఐ ఆర్.వెంకటసుబ్బయ్య పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. వెంకటసుబ్బయ్య 36 ఏళ్ల పాటు పోలీసుశాఖలో పనిచేసి పలు అవార్డులు, రివార్డులు పొందినట్లు తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ దుగ్గిరెడ్డి, అవుకు ఎస్ఐ రాజారెడ్డి, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.